క్లుప్తంగా

సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కొత్తగూడెంరూరల్: జనవరిలో జరిగిన ఎంఐ చాంప్స్ పోటీ పరీక్షలలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీవిద్యా విద్యాలయం విద్యార్థులు సత్తా చాటరని పాఠశాల సీఈఓ చైతన్యకృష్ణ తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ముందు ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నగేష్‌గుప్తా, డీన్ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటరీ ఆనంద్ పదవీ కాలం పొడిగింపు



ఇల్లెందు: ఇల్లెందు కోర్టులో సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్ నోటరీ పదవీ కాలం పొడిగించారు. శనివారం ఆనంద్ విలేకరులతో మాట్లాడుతూ.. 2007లో నోటరీగా బాధ్యతలు స్వీకరించిన తనకు మరో ఏడాది ఆ పదవిలో కొనసాగేలా కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ లా అండ్ జస్టిస్ న్యూఢిల్లీ నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మాంటిస్సోరీ చైర్మన్ జోష్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ కల్పన, డాక్టర్ మోతీలాల్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, రవికుమార్, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఇందిర హర్షం వ్యక్తం చేశారు.

భూపోరాట కేంద్రంలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీబస్తీ రాజీవ్‌నగర్ తండా గ్రామంలో భూపోరాటం ద్వారా ఆక్రమించుకున్న స్థలంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం చేసి రహదారి సౌకర్యం కల్పించుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ, మండల ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే తదితరులతోపాటు సంబంధిత అధికారులకు గుడిసెవాసుల సమస్యలను వివరించామని చెప్పారు. పేదలు నిర్మించుకున్న ఇళ్ల కాలనీకి కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే పార్టీ ఆధ్వర్యంలో శ్రమదానంతో రోడ్డు నిర్మించుకున్నట్లు తెలిపారు. తాగునీరు, విద్యుత్, పక్కా గృహాల మంజూరు కోసం భవిష్యత్‌లోనూ ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. మోహన్‌రావు, రమేష్, లలిత, సుజాత, రాజు, రజియా పాల్గొన్నారు.

పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారు..



కండువా కప్పి ఆహ్వానిస్తున్న కామేష్

పాల్వంచ: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్తకొత్త పథకాలు ప్రారంభించడం, ఎన్నికలు అయిపోగానే మరిచిపోవడం కేసీఆర్‌కు సాధారణమేనని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. శనివారం ఆయన పట్టణంలోని వెంకటేశ్వర హిల్స్ కాలనీలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఎస్పీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి, పోడు భూములకు పట్టాలిస్తామని ఎన్నో వాగ్దానాలు చేసి అమలు మరిచారన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ లేదని, రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎందుకు ఖాళీగా ఉంచారో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పర్యటన

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ శనివారం పర్యటించారు. పలు శుభకార్యాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్, లకావత్ గిరిబాబు, వేల్పుల నరసింహారావు, ఎదళ్లపల్లి వీరభద్రం, రామిశెట్టి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు, ఎంపీటీసీ పెండ్యాల రాజశేఖర్, భోజ్యాతండా సర్పంచ్ లావుడ్యా కిషన్‌లాల్ పాల్గొన్నారు.

జొన్న ఆహారం.. సంపూర్ణ ఆరోగ్యం

'ఓల్డ్ ఈజ్ గోల్డ్'అన్న సామెతను ఇప్పుడు ఆహారానికి అన్వయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వరితో పోల్చుకుంటే జొన్న ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలని చెబుతున్నారు. దీంతో అందరి దృష్టి సంప్రదాయ వంటకం జొన్న రొట్టెపై పడింది. ఈ ఆహారం తీసుకుంటున్న గిరిజనుల్లో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, ఊబకాయం వంటి సమస్యలేమీ కనిపించడం లేదని చెబుతున్నారు. రక్తహీనత, అజీర్ణ సమస్యలు చాలాతక్కువంటున్నారు. ఆధునిక జీవనశైలి గిరిజనులను ప్రభావితం చేస్తున్నా తిండి విషయంలో ఇంకా పూర్వికుల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని పాటిస్తుండటమే వారి ఆరోగ్యానికి శ్రీరామరక్ష.

- బీపీ, షుగర్, స్థూలకాయానికి దూరం
- అలవాటుగా మారిన గటక, రొట్టె
- ఆరోగ్య రక్షణగా సంప్రదాయ వంటకం

సండే స్పెషల్

ఇల్లెందురూరల్: ఆహారపు అలవాట్లతోనే పలు దీర్ఘకాలిక రోగాలు సంక్రమిస్తున్నాయని ఆరోగ్య సర్వేలు వెల్లడిస్తున్నాయి. కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం, నిద్రలేమి, పని ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో బీపీ, షుగర్, ఊబకాయం వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆధునిక సమాజంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కష్టంగా ఉంది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. మూడు పదులవయస్సుకే బీపీ, షుగర్ మందులు వాడుతుండటం గమనార్హం. అయితే గ్రామీణ ప్రాంత వాసుల్లో ఈ సమస్య చాలా తక్కువగా ఉంటోంది. దీనికి ప్రధాన కారణం వారు తీసుకుంటున్న ఆహారం ఒకటైతే.. శారీరక శ్రమ మరో కారణం.



అమ్మేందుకు జొన్న రొట్టెలు తయారు చేస్తున్న మహిళలు

బీపీ, షుగర్, స్థూలకాయం దూరం..

మూడుపూటలా బియ్యంతో వండిన ఆహారం తీసుకోకూడదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నా ఉరుకులు పరుగుల జీవితంలో ప్రజలకు తప్పడం లేదు. దీంతో ఏజెన్సీ పల్లెల్లో గిరిజనులు తీసుకుంటున్న మొక్కజొన్న ఆహారపు అలవాట్లు ఇప్పుడు అందరిని ఆలోచింపజేస్తున్నాయి. ఏజెన్సీ గ్రామాల్లో నివాసం ఉండే ఆదివాసీ, గిరిజనులు మొక్కజొన్న, జొన్నలతో తయారు చేసుకునే రొట్టె, ఎండుకారంతో కూడిన వంటలను ఆహారంలో తప్పనిసరి చేసుకుంటున్నారు. పూర్వికుల నుంచి సంప్రదాయ ఆహారంగా వస్తున్న మొక్కజొన్న, జొన్న రొట్టె, గటకలనే ప్రధాన భోజనంగా స్వీకరిస్తూ వస్తున్నారు. ఈ ఆహారపు అలవాట్లు కలిగి ఉన్న గిరిజనులు స్వల్ప సంఖ్యలో మాత్రమే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుండగా మిగతా సామాజిక వర్గాలు, పట్టణాల్లో నివసించే ప్రజలలో అత్యధికులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు.

జొన్న రొట్టెలతో ఆరోగ్యం..

గిరిజనులు తీసుకునే మొక్కజొన్న, జొన్న రొట్టె, గటకలో అత్యధికంగా ఫైబర్ (పీచు పదార్థాలు), న్యూట్రిషన్లు, విటమిన్లు ఉంటాయి. శరీర నిర్మాణానికి తోడ్పడే ప్రోటీన్లు, శక్తినిచ్చే పదార్థాలతో పాటు రక్తవృద్ధికి ఇనుము, కాల్షియం, విటమిన్-బి, పోలిక్ ఆమ్లం వంటి సూక్ష్మపోషకాలు పుష్కలంగా లభిస్తాయి. శరీరంలో ఉండే కొవ్వును తగ్గించే శక్తి జొన్నల్లో ఉంది. అలాగే ఎముకలు పటిష్టంగా ఉండేందుకు పాస్పరస్ లభిస్తుంది. నరాల బలహీనతను కూడా తగ్గిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. జీర్ణశక్తిని పెంపొందించి అందుకు అవసరమైన హార్మోన్లను వృద్ధి చేస్తాయి. అందువల్లే జొన్న ఆహారం తీసుకునేవారు ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు.



ఇంట్లో కట్టెల పొయ్యిపై రొట్టె కాలుస్తున్న మహిళ

నేడు పట్టణాల్లోనూ ప్రత్యేక స్టాల్స్..

మారిన జీవనశైలి, ఆరోగ్య నియమాలు పాటించే క్రమంలో చాలామంది నేడు జొన్న రొట్టెలకు ప్రాధాన్యమిస్తున్నారు. హోటల్ నిర్వాహకులు ఆర్డర్లపై రొట్టెలు సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లో నేడు ప్రతి కూడలిలోనూ ప్రత్యేకంగా జొన్న రొట్టె తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. దీంతో ప్రస్తుతం జొన్న రొట్టెలకు డిమాండ్ పెరిగింది.

జొన్నరొట్టెకు ప్రాధాన్యం



జొన్న రొట్టె, గటకకు ప్రాధాన్యం తగ్గలేదు. చిన్నపిల్లల నుంచి అన్ని వయస్సులవారు రొట్టెపై మక్కువ చూపిస్తున్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు ఇలాంటి ఆహారం అవసరమని ప్రతిఒక్కరూ గుర్తిస్తున్నారు. గిరిజనులే కాకుండా ఇతర సామాజిక వర్గాలవారు కూడా ఇప్పుడు జొన్నరొట్టె, గటకలను ఇష్టంగా తీసుకుంటున్నారు.

– దుర్గారావు, సెర్ప్ ఏపీఎం, ఇల్లెందు మండలం

రెండు పూటలూ రొట్టె తీసుకుంటాం



ప్రతిరోజూ ఉదయం, రాత్రి జొన్న రొట్టె తీసుకుంటాం. ఇంటిల్లిపాదికీ రెండు పూటలా ఇదే ఆహారం. ఉద్యోగ విరమణ తీసుకున్నప్పటికీ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. నేటికీ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటంలో జొన్నరొట్టే అసలు రహస్యం. మా తాతముత్తాతల దగ్గర నుంచి అందరికీ ఇదే ఆహారం.

– హరిసింగ్, విజయలక్ష్మీనగర్

ఆరోగ్యానికి మేలైన ఆహారం



జొన్న రొట్టెలు, గటక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జొన్నలో పిండిపదార్థాలు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. విటమిన్-బి, కాల్షియం, ఐరన్, పాస్పరస్, పొటాషియం, సోడియం వంటి లవణాలు ఉంటాయి. జీర్ణకోశానికి మేలు చేస్తాయి. ఎముకలను పటిష్టం చేస్తాయి.

– డాక్టర్ లోహిత, వైద్యాధికారి, కొమరారం పీహెచ్‌సీ

మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువ



మాట్లాడుతున్న రమేష్‌కుమార్ మక్కడ్

సింగరేణి(కొత్తగూడెం): ఆడ, మగ సమానమైన భావనను మహిళలు పదేపదే తన విజయాలతో చెబుతున్నా ఇంకా వెట్టిచాకిరీ, బానిసత్వం తప్పటం లేదని సీనియర్ న్యాయవాది, ఆలిండియా లాయర్స్ యూనియన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఏపవర్ బస్తీలోని గిరిజన బాలికల వసతిగృహంలో శనివారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరకట్న, అత్తింటి వేధింపులు మహిళలను మానసికంగా కుంగదీస్తున్నాయన్నారు. తల్లితండ్రులు అమ్మాయి, అబ్బాయిలను సమానంగా చూడాలని వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటం ద్వారా వారు ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొనేలా స్ఫూర్తి నింపాలని చెప్పారు. లింగసమానత్వాన్ని సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మహిళలకు ఓర్పు సహనంతో పాటు ఏకాగ్రత, అంకితభావం ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటానికి వారి హక్కుల గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది పురుషోత్తంరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.నాగస్రవంతి, జ్యోతి, విశ్వకర్మ, హాస్టల్ వార్డెన్ మంగ్‌ని, టీచర్ రాములు, రత్నాకర్, విద్యార్థినులు, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

సుజాతనగర్: మాలబంజర గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు శనివారం ముగిశాయి. శనివారం ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి బంధువులు, ఆడపడుచులు పెద్దఎత్తున రావడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానికులు ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు చొప్పకట్ల జనార్ధనశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మా గోడు ఆలకించండి



మోకాళ్లపై నిలబడి వేడుకుంటున్న దళితులు

జూలూరుపాడు: మా ఇనాం భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వెంగన్నపాలెంకు చెందిన దళితులు జూలూరుపాడులో చేపట్టిన నిరహార దీక్ష 17వ రోజు శనివారం కొనసాగింది. దళితులు మోకాళ్లపై నిలబడి ప్రభుత్వ అధికారులు తమ గోడు ఆలకించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ.. గుండెపుడి రెవెన్యూ పరిధిలో ఉన్న 1.09 ఎకరాల సాగు భూమిని అక్రమంగా పట్టా పొందిన వెంగన్నపాలెంకు చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు పట్టాను రద్దు చేసి భూమిని మాకు అప్పగించి న్యాయం చేయాలని కోరారు.

తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు

ఇల్లెందు: స్థానిక మార్కెట్ చైర్మన్ హరిసింగ్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్, మాదిగ జేఏసీ, టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం సీఐ రాజుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదూరి రవి, బోశాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన బీజేపీ

పాల్వంచ: ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ భిక్షపతి అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ చర్ల నుంచి హైదరాబాద్ వరకు భిక్షపతి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం పాల్వంచ చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని ఎస్సీలను మోసం చేసిందని విమర్శించారు. రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి సోమయ్య, దేసంగి రమణయ్య, మిరియాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీను, గుర్రం నాగమణి, కూరపాటి సునీల్, రవి, వెంకటప్పయ్య, కటుకూరి శేఖర్‌బాబు, సందీప్, వెంకట్, నర్సింహా, వెంకటేశ్వర్లు, సురేశ్, శ్రీను పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యాన నిరసనలు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం నిరసన తెలిపి ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. బండి సంజయ్, బీజేపీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహిళలను అవమానిస్తూ పార్టీ అధ్యక్షుడుగా బండి కొనసాగే అర్హత లేదని, సంజయ్‌ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్యకర్తలు



సింగరేణి(కొత్తగూడెం): పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకులు



ఇల్లెందు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించొద్దు

పాల్వంచ: బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని స్కాం లేదని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని కుంటినాగులగూడెంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడుతూ.. లిక్కర్ స్కాంలో ఎంపీ కవిత పేరు ఉన్నా ఆరు నెలలుగా ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను కేంద్రం తన గుప్పిట్లో ఉంచుకుని కాలయాపన చేసిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లో రాష్ట్రంలో ఉన్న సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. పేదల అందించాల్సిన పథకాలు సొంత వారికి కాకుండా అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. పేదల కష్టాలు తీర్చేది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, చారి, చాంద్‌పాషా, పైడిపల్లి మనోహర్, రాము, శెట్టిపల్లి వెంకట్, రమేష్, కొండం వెంకన్న, వానపాకుల రాంబాబు, వేముల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

రేపు విద్యుత్ పరిష్కార వేదిక

ఇల్లెందురూరల్: ఈ నెల 13న ఇల్లెందులో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ట్రాన్స్‌కో సబ్‌డివిజనల్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఏడీఈ కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వినియోగదారుల ఫోరం ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

26న ఉచిత మెగా వైద్యశిబిరం



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గడల శ్రీనివాసరావు

సుజాతనగర్: సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న నిర్వహించనున్న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. సుజాతనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెల్త్ క్యాంపు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ క్యాంపునకు హైదరాబాద్‌లోని నిమ్స్, స్టార్, కేర్ ఆస్పత్రుల వైద్యులు వైద్యసేవలు అందజేస్తారని చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు జీఎస్సార్ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జీఎస్సార్ ట్రస్ట్ సభ్యులు అంజి, ప్రభాకర్, జోగారావు, ఉజ్జీవరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడా హరినాయక్, ఆర్‌ఎంపీ వైద్యులు పోటు రాఘవరావు, వెంకట్రావు, చింతలపూడి రాజశేఖర్ పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

పాల్వంచ: యువత సమాజంలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలో సాయినగర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్‌ను బహూకరించారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి ఉపయోగపడతాయన్నారు. పట్టుదలతో సాధన చేస్తే క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో కందుకూరి రాము, దారా చిరంజీవి, నిర్వాహకులు ఎం.వంశీ, కె.సంపత్, కె.రామారావు, అశోక్, ప్రవీణ్, రాము, కృష్ణ, శామ్యూల్, పవన్, శేషగిరి, శేఖర్, నాగేశ్వరరావు, హుస్సేన్, నాగసత్యం, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

మల్బరీ సాగుతో రైతులకు అధిక ఆదాయం



మల్బరీ తోటను పరిశీలిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మల్బరీ సాగుతో ఎకరానికి రూ.లక్ష ఆదాయం వస్తుందని జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న అన్నారు. శనివారం ఆయన ములకలపల్లి మండలం పూసుగూడెం, చుంచుపల్లి మండలంలోని రాంపూర్ గ్రామాలలో మల్బరీ తోటలు, తేనెటీగల పెంపకాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ.. రైతులు ఆదాయం ఉన్న పంటలు సాగు చేయాలని సూచించారు. మల్బరీ సాగు, తేనెటీగల పెంపకం ఎంతో లాభదాయకమైనవని చెప్పారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పద్ధతులను, సాంకేతిక సలహాలు, సూచనలను రైతులకు సూచించారు. పట్టు పురుగుల పెంపకంలో షెడ్ నిర్మాణం, మల్బరీ తోటల పెంపకంపై అవగాహన, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించారు. మార్కెట్‌లో పట్టుకు డిమాండ్ ఉందని, ఎలాంటి దళారి వ్యవస్థ లేకుండా పట్టుపరిశ్రమ సాగుతో రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటలో మల్బరీని అంతరపంటగా సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో రైతులు సున్నం గోపయ్య, రవి, సెరీకల్చర్ అధికారి సీహెచ్ కామేశ్వరరావు, కార్యాలయ అధికారి సముద్రాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలం సాధించే వరకు ఉద్యమిస్తాం

ఇల్లెందురూరల్: కొమరారంను మండలంగా ప్రకటించే వరకు ఉద్యమిస్తామని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి పొడుగు నర్సింహారావు అన్నారు. కొమరారం, బోడు కేంద్రాలుగా నూతన మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ చేపట్టిన పాదయాత్ర శనివారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. పదో రోజు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి సందర్భంగా గ్రామాలలో న్యూడెమోక్రసీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి కుటుంబానికి బొట్టుపెట్టి తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 4న మర్రిగూడెంలో ప్రారంభించిన పాదయాత్ర ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడితో ముగుస్తుందని చెప్పారు. ఎనిమిది రోజులపాటు పాదయాత్ర ద్వారా ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే క్యాంపు కార్యాలయం ముట్టడి నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మోతీలాల్, జోగ కృష్ణ, మూడు మాలు, బుర్రి ప్రవీణ్, పాపయ్య, వేప రాణి, రాజేశ్వరి, పూనెం సైదమ్మ, లక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



బొట్టుపెట్టి ఆహ్వానం పలుకుతున్న కార్యకర్తలు

అటెన్షన్ ప్లీజ్

పక్కా రోడ్డు కోసం ఎదురు చూపు..

టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ హనుమా తండా నుంచి కోయగూడెం ఆశ్రమ పాఠశాల వరకు పక్కా రోడ్డు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దశాబ్దాలుగా పంట పొలాల నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వైద్యం కోసం సులానగర్ పీహెచ్‌సీకి, కొత్తగూడెంకు వెళ్లాలంటే ఈ మార్గమే దగ్గరగా ఉంటుంది. పంట పొలాల భూ యజమానుల అభ్యంతరంతో పక్కా రోడ్డుకు మోక్షం లభించడం లేదు. గతంలో కలెక్టర్ పక్కా రోడ్డు నిర్మించాలని ఆర్డీఓకు ఆదేశాలు జారీ చేశారు. అయినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : ఎల్.వీరభద్రం, తహసీల్దార్, టేకులపల్లి
సెల్ నంబర్ : 9392919737